తెలుగు దినపత్రిక
ప్రభాత
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 66
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
సోమవారం, 18-09-2023




## సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లే తెలంగాణకు విముక్తి

### కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటాన్ని కూడా వక్రీకరించింది

### కేంద్రహోంమంత్రి అమిత్ షా



3 లో

**హైదరాబాద్ సెప్టెంబర్ 17**

కేంద్రం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా హాజరయి.. జాతీయ జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వార్ మెమోరియల్‌లో అమరవీరులకు నివాళులు అర్పించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేంద్ర బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సశస్త్ర సీమ బల్‌ను వర్చువల్‌గా అమిత్‌షా ప్రారంభించారు.ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ విమోచనం కోసం పోరాడిన వీరులకు వందనమన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లే తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. సర్దార్ పటేల్ లేకపోతే తెలంగాణకు విముక్తి లభించేది కాదని, సర్దార్ పటేల్, మున్షీ వల్లే నిజాం పాలన అంతమైందని అన్నారు. తెలంగాణ చరిత్రను కొందరు వక్రీకరించారని, నరేంద్రమోదీ ప్రధాని అయ్యాకే ఆ పొరపాటును సరిచేశారని అమిత్ షా అన్నారు. మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందన్నారు. కాంగ్రెస్ స్వాతంత్ర్య పోరాటాన్ని కూడా వక్రీకరించిందని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాజకీయం చేస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు క్షమించరని అమిత్ షా అన్నారు.



2 లో

- మహాలక్ష్మీ పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2 వేల 500 ఆర్థిక సాయం
- రూ.500 లకే గ్యాస్ సిలిండర్
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం
- ఇళ్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం
- ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గజాల ఇంటి స్థలం
- కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పంట పెట్టుబడి సాయం
- చేయూత పథకం ద్వారా నెలకు రూ.4 వేల పింఛన్

# సోనియా గాంధీ హామీల వర్షం



# ఐటీ రంగంలో దేశంలోనే మేటిగా ఎదిగిన తెలంగాణ

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రోజుకో కొత్త సంస్థ ముందుకు
- గణనీయంగా9 లక్షలకు పెరిగిన ఉద్యోగుల సంఖ్య
- తెలంగాణ పల్లెలకు జాతీయ అవార్డులు
- విశ్వనగరంగా హైదరాబాద్.. సంతోషాల సాగుబడి
- అన్నింటా నంబర్ 1 తెలంగాణ
- జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కెసిఆర్

2 లో




## వినాయక చవితి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

**జయభేరి, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేసిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకుందాం పర్యావరణ పరిరక్షణకు అందరం చర్యలు తీసుకుందాం తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలి. వినాయకుని ఆశీస్సులతో సకల విఘ్నాలు తొలగిపోవాలని అందరికీ శుభం కలగాలని మనసారా కోరుకుంటున్నాను. యువత కూడా నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు కాకుండా కలిసిమెలిసి సోదర భావంతో నిర్వహించుకోవాలని ఆయన తెలియజేశారు వినాయకుని నిమజ్జనం రోజు చెరువు వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలని తొందరపడవద్దని ఆయన కోరారు.

## పైరవీలకు తావు లేకుండా గృహలక్ష్మి పథకం అమలు

### ఎవరైనా డబ్బులు అడిగితే నాకు చెప్పండి: మంత్రి హరీశ్‌రావు



**సిద్దిపేట సెప్టెంబర్ 17**

పైరవీలకు తావు లేకుండా గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాకేంద్రంలోని కొండ మల్లయ్య గార్డెన్స్‌లో గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.3లక్షల ఇంటి మహా లక్ష్మి పేరుమీద ఇస్తున్నామన్నారు. మహిళలకు డబ్బులు ఇస్తే ప్రతి

మిగతా 2 లో

## ప్రధాని నరేంద్ర మోదీ 73వ జన్మదినం తెలంగాణ సిఎం కేసిఆర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్ సెప్టెంబర్ 17**

భారత ప్రధాని నరేంద్ర మోదీ 73వ జన్మదినం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగతం, రాష్ట్ర ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం కేసీఆర్ లేఖ రాశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో 1950 సెప్టెంబర్ 17న జన్మించారు. ఆయన పూర్తి పేరు నరేంద్ర దామోదర్‌దాస్ మోదీ. దామోదర్ దాస్ మోదీ హిరాబెన్ దంపతుల కుమారుడు. ఆరుగురు సంతానంతో మోదీ మూడో సంతానం. ఆయన జన్మదినం సందర్భంగా కేంద్రమంత్రులు, పలు పార్టీల నాయకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## కేసీఆర్ సత్సంకల్పం స్వచ్ఛ తెలంగాణ పరిపూర్ణం

2 లో



ప్రభాత జయభేరి
jayabheridaily.com


▶▶ మొదటిపేజీ తరువాయి

## పైరవీలకు తావు లేకుండా గృహలక్ష్మి పథకం అమలు

రూపాయి సద్వినియోగం అవుతుందన్నారు. అందరికీ ఒకేసారి ఇవ్వడం ఇబ్బందని, ముందువెనుకా అందరికీ ఇస్తామన్నారు. అందరు మనవాళ్లేనని, ఉండేది మన ప్రభుత్వమే.. సీఎం మన కేసీఆరేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో లంచాలు ఇచ్చిన ఇల్లు దక్కలేదని, తిరిగి తిరిగి కళ్లు అరిగేవన్నారు. మన ప్రభుత్వంలో ఏ మధ్యవర్తులు లేకుండా పైరవీలు లేకుండా నేరుగా ఖాతాల్లోనే డబ్బులు జమచేయనున్నట్లు పేర్కొన్నారు.

**ఎవరైనా డబ్బులు అడిగితే నాకు చెప్పండి**

లంచం, మిత్తి, అప్పు లేదని, ఎది లేకుండా మీకు పైసలు వస్తాయని, మన దగ్గర ఎవ్వరు మిమ్మల్ని డబ్బులు అడగరని.. తప్పుదారి ఎవరైనా అడిగితే తనకు చెప్పాలన్నారు. పంచాయతి సెక్రెటరీ, సర్పంచ్ అందరూ మీకు అందుబాటులో ఉండి డబ్బులు ఇప్పిస్తరు. మీరు త్వరగా పని మొదలుపెట్టాలని.. రెండు నెలల వరకు చూసి పని స్టార్ట్ చెయ్యని వారికి బదులు మరొకరిని ఎంపిక చేస్తామన్నారు. పాలమూరు జిల్లా ప్రజలకు తమకు నీళ్లు వచ్చాయని రెండు పంటలు బాగా పండుతయని సంతోషంగా ఉన్నారన్నారు.నాడు పాలమూరు జిల్లా కరువు పీడిత, వలసలు పోయిన ప్రాంతమని, పాలమూరు ప్రజల కళ్లల్లో ఆనందం వేస్తే.. కానీ కాంగ్రెస్ వాళ్ల కళ్లలో కన్నీళ్లు వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రాజెక్టులకు అడ్డంపడడం.. కేసులు పెట్టించి పనులు ఆపే ప్రయత్నం చేశారని, - మన ప్రభుత్వం అభివృధి ముందుకు పోతుంటే.. ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీ తిట్లు తిటడ్డంలో పోటీపడుతున్నారన్నారు. పని చేసిన ప్రభుత్వం వైపు ఉంటారా..? గోబెల్స్, అబద్ధాలు ప్రచారం చేసే వారి వెంట ఉంటారా ? సద్ది తిన్న రేవు తలవాలి.. సహాయం చేసిన వారిని మరవొద్దన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు మన ప్రాజెక్ట్ కాలువల్లో నీళ్లు పారుతున్న ఒక సుక్క రాలేదు అంటున్నారని విమర్శించారు.




## నిపా వైరస్‌లోని బంగ్లాదేశ్ స్ట్రెయిన్ అత్యంత ప్రమాదకరం

### ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్ కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ రమణ్ గంగాఖేద్కర్

**జయభేరి, న్యూ డిల్లీ సెప్టెంబర్ 17**

కేరళలో నిపా వైరస్ కలకలం రేపుతున్నది. ఆ రాష్ట్రంలో ఆరు నిపా కేసులు వెలుగు చూడగా అందులో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో నిపా వైరస్‌లో బంగ్లాదేశ్ స్ట్రెయిన్ చాలా ప్రమాదకరమని 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌కు చెందిన మాజీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రమణ్ గంగాఖేద్కర్ చెప్పారు.బంగ్లాదేశ్ స్ట్రెయిన్ సోకిన ప్రతి 10 మందిలో 9 మంది మరణించే అవకాశం ఉందని రమణ్ తెలిపారు. ఈ స్ట్రెయిన్ ఊపిరితిత్తులపై తీవ్రంగా పనిచేసి ఊపిరాడకుండా చేస్తుందని, దాంతో మరణాల రేటు ఎక్కువగా ఉంటుందని ఆయన చెప్పారు. టాప్ ఎపిడమియాలజిస్ట్ అయిన ఖేద్కర్.. గత మూడు దశాబ్దాలుగా అంటు వ్యాధుల నిర్మూలన కోసం భారత్ చేస్తున్న పోరాటంలో కీలక పాత్ర పోషించారు.కాగా, కేరళలో విస్తరిస్తున్నది నిపా వైరస్‌లోని బంగ్లాదేశ్ స్ట్రెయినేనని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి ఈ నెల 13న ప్రకటించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఆరు కేసులు నమోదయ్యాయని, వారిలో ఇద్దరు మరణించారని ఆమె తెలిపారు. మిగతా నలుగురు చికిత్స పొందుతున్నారని చెప్పారు.



## భారతీయ విద్యార్థిని జాహ్నవిమృతి పై

### సీటెల్ మేయర్ బ్రూస్ హారెల్ క్షమాపణ

**జయభేరి, వాషింగ్టన్ సెప్టెంబర్ 17**

అమెరికాలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టడంతో భారతీయ విద్యార్థిని జాహ్నవి కందుల మృతిచెందడం, ఆమె మరణంపై ఓ పోలీస్ అధికారి ఎగతాళిగా మాట్లాడటంపై సీటెల్ మేయర్ బ్రూస్ హారెల్ క్షమాపణ కోరారు. జాహ్నవి మృతి గురించి పోలీస్ అధికారి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో మేయర్ స్పందించారు.కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన జాహ్నవి కందుల ఈ ఏడాది జనవరిలో రోడ్డు దాటుతుండగా పోలీస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 23 ఏండ్ల జాహ్నవి అక్కడికక్కడే మరణించింది. నార్త్ఈస్టర్న్ యూనివర్సిటీలోని సీటెల్ క్యాంపస్‌లో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్న భారతీయ విద్యార్థిని మరణం పట్ల ఒక పోలీస్ అధికారి చాలా చులకనగా, హేళనగా మాట్లాడాడు. ఆమె ప్రాణాలకు విలువలేదని సీటెల్ పోలీస్ అధికారి డేనియల్ ఆడెరర్ తన సహోద్యోగితో అన్నాడు. డేనియల్ నవ్వుతూ.. 'ఆమె చనిపోయింది. సాధారణ వ్యక్తి' అని తెలిపాడు. అలాగే మళ్లీ నవ్వుతూ.. 'ఒక చెక్ రాయండి పదకొండు వేల డాలర్లకు' అని చెప్పాడు. ఆమె వయసు 26 ఏండ్లని, ఆమె ప్రాణాలకు విలువ లేదని నవ్వుతూ అన్నాడు.కాగా, పోలీస్ అధికారి డేనియల్ ఆడెరర్ మరో పోలీస్ అధికారితో ఫోన్‌లో మాట్లాడిన ఈ సంభాషణ అతడి బాడీ కెమెరాలో రికార్డ్ అయ్యింది. ఈ ఆడియో క్లిప్‌ను సీటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసింది. అది వైరల్ కావడంతో పోలీస్ అధికారి డేనియల్ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సంఘటనపై కొందరు నిరసన వ్యక్తం చేశారు. ఆ పోలీస్ అధికారిపై చర్యలకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు సీటెల్ పోలీస్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది. ఈ క్రమంలోనే సీటెల్ మేయర్ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ క్షమాపణ చెప్పారు.

# తెలంగాణా ప్రజలకు సోనియా గాంధీ హామీల వర్షం

**రంగారెడ్డి సెప్టెంబర్ 17**

రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన విజయభేరి సభలో ఆ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను ప్రకటించింది.

కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఈ హామీలను ప్రకటించారు.తెలంగాణలో రానున్నఎన్నికల్లో అధికారమే టార్గెట్ గా దూసుకెళ్తున్న కాంగ్రెస్ మహిళా ఓటర్లే మెయిన్ టార్గెట్ గా మెజారిటీ హామీలు ప్రకటించచింది .ఆరు గ్యారంటీ హామీలతో పాటు సోనియాగాంధీ ప్రకటించిన మొత్తం ప్రకటించిన హామీల లిస్టు ఇదే.



**కీలక ప్రకటనలు ఇవే**

మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళలకు నెలకు రూ.2 వేల 500 ఆర్థిక సాయం. రూ.500 లకే గ్యాస్ సిలిండర్. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణం. ఇళ్లు లేని వారికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం. ఉద్యమకారుల కుటుంబాలకు 250 చ.గజాల ఇంటి స్థలం. రైతు భరోసా ద్వారా రైతులు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పంట పెట్టుబడి సాయం. వ్యవసాయం కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం. వరి పంటకు ప్రతి క్వింటాల్ కు రూ.500 బోనస్. గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు. చేయూత పథకం ద్వారా నెలకు రూ.4 వేల పింఛన్. రాజీవ్ ఆరోగ్య శ్రీ లిమిట్ రూ.10 లక్షల వరకు పెంపు.

తుక్కుగూడలో కాంగ్రెస్ విజయభేరీ బహిరంగ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే మాట్లాడుతూ... సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజలకు చారిత్రాత్మకమైన రోజు అని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం కాంగ్రెస్ 6 గ్యారెంటీలను ప్రకటిస్తోందని తెలిపారు. రైతు భరోసా పథకాన్ని మల్లికార్జున ఖర్గే ప్రకటించారు.

"రైతు భరోసా కింద రూ.15 వేలు పెట్టుబడి సాయం. కౌలురైతులకు రూ.12 వేలు సాయం. వరికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్. వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్. ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్. ప్రజా సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం. ఉపాధిహామీ చట్టం చేసింది కాంగ్రెస్సే. ఆహార భద్రత చట్టం చేసి ప్రజల ఆకలి తీర్చింది కాంగ్రెస్." అని ఖర్గే అన్నారు.

# ఐటీ రంగంలో దేశంలోనే మేటిగా ఎదిగిన తెలంగాణ

**జయభేరి, హైదరాబాద్ సెప్టెంబర్ 17**

తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదివారం ఉదయం నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. ఐటీ రంగం గురించి మాట్లాడుతూ.. తెలంగాణలో ఐటీ రంగం దినదినాభివృద్ధి సాధిస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు రోజుకో కొత్త సంస్థ ముందుకు వస్తున్నదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి రాష్ట్రంలో 3 లక్షల 23 వేల 39 మంది ఐటీ ఉద్యోగులు మాత్రమే ఉండగా, నేడు వారి సంఖ్య 9 లక్షల 5 వేల 715కు పెరిగిందన్నారు. అదేవిధంగా 2014లో ఐటీ ఎగుమతులు 57 వేల 258 కోట్ల రూపాయలు కాగా, నేడది 2 లక్షల 41 వేల 275 కోట్లకు పెరిగిందని చెప్పారు. ద్వితీయ శ్రేణి నగరాలైన ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్, సిద్దిపేట వంటి ప్రాంతాలకు కూడా ఐటీని విస్తరించుకొని, ఐటీ టవర్లు నిర్మించుకున్నామని వెల్లడించారు.



**తెలంగాణ పల్లెలకు జాతీయ అవార్డులు**

పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలతో మన పల్లెలు, పట్టణాల రూపురేఖలే మారిపోయాయని, చక్కటి వసతులు సమకూరి, పచ్చదనంతో పరిఢవిల్లుతున్నాయని సీఎం చెప్పారు. ఇటీవల రాష్ట్రపతి చేతులు మీదుగా మన స్థానిక సంస్థల ప్రతినిధులు 13 జాతీయ అవార్డులు అందుకోవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. పాలనా సౌకర్యం కోసం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, కొత్త పంచాయతీలు, అవసరాన్ని బట్టి కొత్త మండలాలు కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రతిజిల్లా ప్రధాన కేంద్రంలో జిల్లా సమీకృత కార్యాలయాలు, జిల్లా పోలీసు కార్యాలయ భవనాలు నిర్మించుకుంటున్నామని, దాంతో ప్రభుత్వ పాలన ప్రజలకు దగ్గరైందని చెప్పారు.

**విశ్వనగరంగా హైదరాబాద్**

హైదరాబాద్ నగరం ఓ మినీ ఇండియా అని సీఎం అభివర్ణించారు. ఇక్కడ అన్ని రాష్ట్రాలు, అన్ని మతాలకు చెందిన ప్రజలు సోదర భావంతో కలసిమెలసి బతుకుతున్నారన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగాలన్న లక్ష్యానికి అనుగుణంగా గట్టి పునాదులు వేశామని, గతంలోలా మత కల్లోలాలు, గొడవలు లేకుండా ఇవాళ హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉందని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నివారించి, సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు 67 వేల కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పనులను చేపట్టి, పూర్తిచేస్తున్నామని చెప్పారు. నగరంలో అద్భుతమైన రోడ్డు రవాణా సౌకర్యాలు అభివృద్ధి చేసుకుంటున్నామని, ఇప్పటికే 20 ఫ్లైఓవర్లు పూర్తిచేసి ప్రారంభించుకున్నామని, అంతర్జాతీయస్థాయిలో ఇప్పటిదాకా 36 పనులు పూర్తి చేశామని తెలిపారు. హైదరాబాద్ నడిబొడ్డున హుస్సేన్ సాగర్ నదీ తీరంలో నూతనంగా నిర్మించిన సచివాలయ సౌధం, అమరవీరుల స్థూపం, 125 అడుగుల ఎత్తులో నిర్మించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నగరానికి మరింత శోభను చేకూర్చాయని సీఎం చెప్పారు. హైదరాబాద్ నగరం నలువైపులా 69 వేలకోట్ల రూపాయల వ్యయంతో మెట్రో రైలును విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, దీంతో హైదరాబాద్ లో మొత్తం 415 కిలోమీటర్ల మెట్రో సౌకర్యం విస్తరించనున్నదని, విశ్వ నగరంగా మరింత అభివృద్ధి చెందనున్నదని అన్నారు.

**సంతోషాల సాగుబడి**

కాళేశ్వరం వంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టుతోపాటు, మిషన్ కాకతీయ, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర మధ్యతరహా, చిన్న ప్రాజెక్టుల పూర్తి తదితర పనులతో తెలంగాణ సాగునీటి రంగం స్వర్ణయుగాన్ని తలపిస్తున్నదని సీఎం చెప్పారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, సకాలంలో విత్తనాలు, ఎరువుల సరఫరా, పెట్టుబడి కోసం రైతుబంధు, రైతు బీమా, 37 వేల కోట్ల రూపాయల వరకు పంటరుణాల మాఫీ తదితర సంక్షేమ చర్యలు రైతన్నకు ఊరటనిచ్చాయన్నారు. వ్యవసాయం పండుగగా మారిందని, సాగుబడిలో, దిగుబడిలో తెలంగాణ రైతన్నలు చరిత్ర తిరగరాస్తున్నారని, ధాన్యం దిగుబడి 3 కోట్ల టన్నులకు చేరుకున్నదని, వరి ఉత్పత్తిలో పంజాబ్ రాష్ట్రాన్ని తలదన్ని దేశంలోనే ప్రథమ స్థానంవైపు తెలంగాణ పరుగులు పెడుతున్నదని సీఎం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం శాశ్వతంగా సంపూర్ణంగా సుజల సుఫల సుసంపన్న వ్యవసాయ రాష్ట్రంగా విలసిల్లేందుకు గానూ కాళేశ్వరం, సీతారామ, పాలమూరు ఎత్తిపోతల పథకాల్లోని మిగిలిన పనులను వెనువెంటనే పూర్తిచేసే కృషిలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమై ఉందని అన్నారు.

**అన్నింటా నంబర్ 1 తెలంగాణ**

నేడు తెలంగాణ అనేక రంగాలలో నంబర్ వన్ స్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని సీఎం వ్యాఖ్యానించారు. అనతి కాలంలోనే విద్యుత్ రంగ సంక్షోభాన్ని అధిగమించి, అన్ని రంగాలకూ 24 గంటల పాటు వ్యవసాయానికి పూర్తి ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమేనని చెప్పారు.

తలసరి విద్యుత్ వినియోగంలో కూడా తెలంగాణ నంబర్ వన్‌గా ఉందన్నారు. తలసరి ఆదాయంలో కూడా 3 లక్షల 12 వేల 398 రూపాయల తలసరి ఆదాయంతో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్‌గా ఉందని చెప్పారు. దేశంలో ఏనాడో స్థిరపడిన పెద్దపెద్ద రాష్ట్రాలను తలదన్నేలా అతి పిన్న వయసు ఉన్న తెలంగాణ ప్రగతి రథచక్రాలు మునుముందుకు దూసుకుపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడు దేశంలో ఏ ప్రాంతంలోనైనా, ఎవరి నోట విన్నా తెలంగాణ మోడల్ మార్మోగుతున్నదని, తెలంగాణ ప్రజలందరి చల్లని దీవెనలతో ఈ ప్రగతి రథచక్రాలు మరింత జోరుగా ముందుకు సాగుతూనే ఉంటాయని, అన్నారు. మన సమైక్యతే మనకు బలమని, ఈ జాతీయ సమైక్యతా దినోత్సవ వేళ బంగారు తెలంగాణ సాధనకు ఒక్కటిగా కృషి చేద్దామని, తెలంగాణ ప్రగతిని ఇదేవిధంగా కొనసాగిద్దామని సీఎం పిలుపునిచ్చారు.

## తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలుస్తుంది

**జయభేరి, కాప్రా :**

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మీర్ పేట్ HB కాలనీ డివిజన్ తిరుమల నగర్ కాలనీ లో జాతీయ జెండా ఎగరవేసిన ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలకు తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త రాష్ట్రమైన తెలంగాణ దేశంలోనే అభివృద్ధిలో ముందున్నదని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ దేశంలోని నెంబర్ వన్ గా నిలిచింది అన్నారు. తెలంగాణ ప్రజలు జాతీయ సమైక్యతకు చిహ్నం అని అన్నారు. దేశ సమగ్రత సమైక్యతకు తెలంగాణ పాటుపడుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, కొత్త రామరావు, BRS నాయకులు జంపాల్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రిలో భక్తుల రద్దీ

**జయభేరి, యాదాద్రి భువనగిరి**

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి సన్నిధిలో భక్తుల రద్దీ అధికంగా ఉంది...ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేశారు. దీంతో ఉచిత దర్శనానికి దాదాపు రెండు గంటలు,ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు గంట సమయం పడుతుంది...భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. లడ్డు ప్రసాదం కౌంటర్లు, నిత్యా కళ్యాణం,కొండక్రింద కల్యాణ కట్ట,పుష్కరిణి, వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది.

## తిరుమల నగర్ కాలనీ ఎక్స్టెన్షన్ అభివృద్ధి కి పాటుపడుతా

### ఇండస్ట్రియల్ జోన్ నుండి రెసిడెన్షియల్ జోన్ గా మార్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

మీర్ పేట్ HB కాలనీ డివిజన్ తిరుమల నగర్ కాలనీ(ఎక్స్టెన్షన్ )అభివృద్ధి కి పాటుపడుతా అని ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇండస్ట్రియల్ జోన్ నుండి రెసిడెన్షియల్ జోన్ గా మార్చిన సందర్భంగా బాణాసంచా కాల్చిన అనంతరం తిరుమల నగర్ కాలనీ (Extesion) రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ లో యేర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా రెసిడెన్షియల్ జోన్ లేక ఇబ్బంది పడుతున్నారు అని ఈ రోజు ఆ కల నెరవేరింది అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ HB కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, BRS నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, కాలనీ ప్రెసిడెంటు బాలరాజ్, చంద్ర శేకర్, మహేశ్వర రావు, లక్ష్మినారాయణ, శ్యాం ప్రకాష్, ప్రసాద్, చిరంజీవి, ప్రసాద్, నర్సింహా, శుషీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాకతీయ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్

**జయభేరి, వరంగల్ :**

వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల(కేఎంసీ)ను ర్యాగింగ్ భూతం వెంటాడుతోంది. పీజీ వైద్యవిద్యార్థిని ప్రీతి మృతి ఘటన మరిచిపోతున్న క్రమంలో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. కేఎంసీలో ఎంబీబీఎస్ ఫస్టీయర్ చదువుతున్న రాజస్తాన్ కు చెందిన మనోహర్ ఈనెల 14న కళాశాల లైబ్రరీలో అర్ధరాత్రి వరకు చదువుకుని హాస్టల్ గదికి వెళ్తుండగా సీనియర్ విద్యార్థులు దాడి చేశారు. పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటున్న సీనియర్ విద్యార్థులు మనోహర్ ను పిలిచి మద్యం తాగించి, నృత్యాలు చేయించినట్లు సమాచారం. సీనియర్లు ఎంతకీ వదలకుండా వేధిస్తుండడంతో ఎదురు తిరిగిన మనోహర్ పై సీనియర్ లు దాడి చేసి దుర్భాషలాడినట్లు తెలిసింది. దీంతో గాయపడిన మనోహర్ ను తోటి విద్యార్థులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల సహాయంతో ప్రిన్సిపల్ తోపాటు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీనియర్ విద్యార్థులు అభినవ్ మోర, సెల్వీ శ్రీహరి, కె. లోకేష్, శ్రీ చరణ్, జె.సాయికిరణ్, హరికృష్ణ, సూర్యప్రకాష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ర్యాగింగ్ విషయాన్ని ప్రిన్సిపల్ మోహన్ దాస్ డీఎంఈకి వివరించగా కళాశాల అంతర్గత కమిటీతో విచారణ చేపట్టారు. సదరు విద్యార్థులను సంవత్సరంపాటు సస్పెండ్ చేసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో కేఎంసీ అధికారులపై ఒత్తిళ్ళు మొదలైనట్లు సమాచారం. ఘటనపై అంతర్గత విచారణ చేసి డిఎమ్ఈకి నివేదిక ఇచ్చామని అక్కడ ఆదేశాల మేరకు విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపాల్ తెలిపారు.

# కేసీఆర్ సత్సంకల్పం స్వచ్ఛ తెలంగాణ పరిపూర్ణం

**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఇస్లావత్ నమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 ర్యాలీ కార్యక్రమంలో కార్మిక &ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పాల్గొని శ్రమాధానం చేశారు. తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం,అమరవీరుల స్థూపాలకు పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి మూలం వద్దే వ్యర్థాల విభజన, వ్యర్థాల తొలగింపు, ఆరోగ్యం, పరిశుభ్రత తదితర అంశాలపై ప్లకార్డులు కూడిన భారీ అవగాహన ర్యాలీ నిర్వహించి స్వచ్ఛ సంకల్పం పై నినాదాలు చేసారు. పీర్జాదిగూడ పెద్ద చెరువు (మినీ ట్యాంక్ బండ్) వరకు చీపురుతో రోడ్లు శుభ్రపరచడం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు మాస్ శానిటేషన్ నిర్వహించి చెరువు పరిసరాలను శుభ్రపరచి మరియు జాతీయ సమైక్యతకు చిహ్నంగా మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... నగర పరిధిలో తడి, పొడి, హానికరక చెత్తను





వేరుగా చేసి సేకరించడం తడి వ్యర్థాలను కంపోస్టుగా, బ్రికెట్స్ గా మార్చే చర్యలు చేపట్టడం, పొడి చెత్తను రీసైక్లింగ్ చేయుటకు DRCC సెంటర్ ను సమీకృత వ్యర్థ పదార్థాల శుద్ధీకరణ పార్క్ నందు ఏర్పాటు చేయడం ద్వారా 100 శాతం చెత్త నిర్వహణలో పీర్జాదిగూడ ముందుందని కొనియాడారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... స్వచ్ఛభారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ పీర్జాదిగూడ విషయంలో, ప్రతి ఒక్కరు సహకరించాలని, ముఖ్యమంత్రి కేసీఆర్ సత్సంకల్పం స్వచ్ఛ తెలంగాణ పరిపూర్ణంగా అమలు చేయడం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించి, నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చగా చేయడానికి అందరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, కార్పొరేటర్లు బోడిగే స్వాతి కృష్ణ గౌడ్, కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్, అలవాల సరిత దేవేందర్ గౌడ్, సుభాష్ నాయక్, బచ్చ రాజు, మద్ది యుగేందర్ రెడ్డి, అమర్ సింగ్, కౌడే పోచయ్య, నవీన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఏంపల్ల అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, నాయకులు బండి సతీష్ గౌడ్, పెంటయ్య, జావీద్ ఖాన్, రఘువర్ధన్ రెడ్డి, ప్రభు మల్లం వెంకటేష్ గౌడ్, పట్టణ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మానవ మనుగడకు మార్గదర్శకుడు విశ్వకర్మ సకల చరాచర సృష్టికి సమస్త వృత్తులకు మూలకారకుడైన విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు. శ్రీ శ్రీ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవం సందర్భంగా రామంతపూర్ డివిజన్ శ్రీనివాసపురం లో వున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.

- జయభేరి, కాప్రా




నేర్ధం భాస్కర్ గౌడ్ అధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి.

- జయభేరి, ఉప్పల్

## బీజేపీ వల్లనే అధికారికంగా విమోచనం

తెలంగాణలోని సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 75వ తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఆధునిక తెలంగాణ, మహారాష్ట్రలోని మరాఠ్‌వాడా ప్రాంతం, కర్ణాటకలోని పలు జిల్లాలతో కూడిన హైదరాబాద్ రాష్ట్ర విముక్తి పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ చరిత్రను తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేసే వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నిజాం హయాంలో తెలంగాణకు విముక్తి కల్పించి స్వాతంత్ర్యం రాకుంటే భారతమాత కడుపులో కాన్సర్ వచ్చినట్లేనని సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన ప్రకటనను కేంద్ర మంత్రి అమిత్ షా గుర్తు చేశారు. 'సర్దార్ పటేల్ లేకుంటే తెలంగాణకు ఇంత త్వరగా విముక్తి వచ్చేది కాదు. దేశాన్ని ఏకం చేయాలనే నినాదంతో పోలీసు చర్యలకు సిద్ధమయ్యామన్నారు. మిలటరీ 'ఆపరేషన్ పోలో' ప్రారంభించిన తర్వాత చుక్క రక్తం చిందకుండా, నిజాం భారత్ శక్తి కంటే ముందే పోరాడి తెలంగాణ స్వాతంత్ర్యానికి సిద్ధమయ్యారు. పటేల్ ఆదేశాల మేరకే కేఎం మున్షీ నేతృత్వంలో ఈ ఆపరేషన్ జరిగింది. 75 సంవత్సరాలుగా దేశంలోని ఏ ప్రభుత్వం కూడా మన యువతకు తెలంగాణా స్వాతంత్ర్య పోరాటం గురించి చెప్పడానికి ప్రయత్నించలేదు. తెలంగాణ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినివ్వడమే లక్ష్యం. మన పెద్దల పోరాటాన్ని స్మరించుకుని వారు కలలుగన్న రాష్ట్రాన్ని నిర్మించడమే సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల లక్ష్యం. తెలంగాణ చరిత్రను దాదాపు 75 ఏళ్ల పాటు కొందరు వక్రీకరించారని, మోదీ ప్రధాని అయ్యాక ఆ తప్పుల్ని సరిచేశారని వెల్లడించారు అమిత్ షా. ఈ 9 ఏళ్ల పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. సర్దార్ పటేల్, కేఎం మున్షీ కారణంగానే తెలంగాణలో నిజాం పాలన అంతమైందని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సంస్థాన్ విమోచన ఎగ్జిబిషన్‌ని ప్రారంభించారు. తెలంగాణ విమోచన దినోత్సవం గురించి తెలియకుండా గత ప్రభుత్వాలు కుట్ర చేశాయని మండిపడ్డారు. భూమి కోసం, భుక్తి కోసం జరిగిన ఈ పోరాటం..సమైక్యతా దిన ఎలా అవుతుందని పరోక్షంగా తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "బ్రిటీష్ నుంచి భారత్‌కి స్వాతంత్ర్యం వచ్చినా నిజాంలు తెలంగాణను 399 రోజుల పాటు పాలించారు. సర్దార్ పటేల్ రంగంలోకి దిగి 400వ రోజు వాళ్లకు నిజాం కర్కశ పాలన నుంచి విముక్తినిచ్చారు. విమోచన దినోత్సవం జరపాలంటే కొందరు భయపడుతున్నారు". ఇక బుజ్జగింపుల కోసం వాస్తవాలను దాచిపెడితే చరిత్ర మిగిలిపోదని అమిత్ షా అభిప్రాయపడ్డారు. 'భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా 399 రోజుల పాటు నిజాం భూభాగంలో రజాకార్ల అరాచకాలు కొనసాగాయి. మన పూర్వీకులు కలలుగన్న తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలి. హైదరాబాద్ విమోచన దినోత్సవంతో తెలంగాణ ప్రజల స్వాతంత్ర్య వేడుకలను అధికారికంగా నిర్వహించాలన్నది.

# టీకాలు ప్రజారోగ్య ప్రయత్నాలకు మూలస్తంభం


**జయభేరి, మేడిపల్లి :**



బోడుప్పల్ మున్సిపాలిటీ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను డా.పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య & ఆరోగ్యశాఖాధికారి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా & డా నారాయణ రావు, కీసర డివిజన్ ఉపజిల్లా వైద్య & ఆరోగ్యశాఖాధికారి తో కలసి సందర్శించి, ఇమ్యునైజేషన్ రిజిస్టర్‌లను, UPHC యొక్క పారిశుధ్యాన్ని & ఫార్మసీ స్టోర్ రూమ్, ల్యాబ్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. యు పి ఎచ్ సి సిబ్బంది తో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ... అర్హులైన వ్యక్తులు, ముఖ్యంగా పిల్లలు, శిశువులకు షెడ్యూల్ ప్రకారం అవసరమైన టీకాలు అందేలా చూడడమే సిబ్బంది ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఆ ఇమ్యునైజేషన్ పిల్లలు వివిధ వ్యాధులకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి అవసరమైన వ్యాక్సిన్‌లను ప్రభుత్వం సరఫరా చేసిన టీకాలు అనేక రకాల అంటు వ్యాధుల నుంచి చిన్ననాటి వ్యాధులైన మీజిల్స్, పోలియో, ఇన్ఫ్లుఎంజా, హెపటైటిస్ నిరోధించడానికి ఉపయోగపడతాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యాక్సిన్‌లు ఎటువంటి ఖర్చులేకుండా ఉచితముగా అందించబడతాయి. ప్రభుత్వంసరఫరా చేయబడిన టీకాలు ప్రజారోగ్యప్రయత్నాలకు మూలస్తంభం, సమాజంలోని సభ్యులందరికీ వ్యాక్సిన్‌లకు ప్రాప్యతను నిర్ధారించడం ద్వారా ఆరోగ్య సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ అనేక రకాల వ్యాధుల నుండి రక్షణను అందిస్తాయి కావున ప్రజలందరూ ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను ప్రతి బుధవారం, శనివారం క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం అందించాలి అని పేర్కొన్నారు.

# జైళ్ల శాఖ డిఐజిని కలిసిన యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బృందం

**జయభేరి, హైదరాబాద్:**



హైదరాబాద్ రేంజ్ జైళ్ల శాఖ డిఐజిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి. శ్రీనువాస్ ను యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బృందం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అవినీతి రహిత సమాజం కోసం శాంతియుతంగా ముందుకు వెళ్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తానని జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డిఐజి శ్రీనువాస్ అన్నారు. యూత్ పర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళుతున్న మా సంస్థకు ఎంతో మంది అధికారులు సలహాలు, సూచనలతో ముందుకు వెళతామన్నారు. డిఐజి శ్రీనువాస్ సర్ తమ సంస్థకు సలహాలతో పాటు సహకారం అందిస్తున్నారని అన్నారు. హైదరాబాద్ రేంజ్ జైళ్లశాఖ డిఐజిగా రావడం అభినందించదగ్గ విషయమని, మా సంస్థకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ కార్యవర్గసభ్యులు కొమటి రమేశ్ బాబు, వరికుప్పల గంగాధర్, బత్తిని రాజేశ్, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

# బండారి లక్ష్మారెడ్డి కే తమ పూర్తి మద్దతు

**జయభేరి, కాప్రా :**



మీర్ పేట్ HB కాలనీ డివిజన్ ఆనంద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్ లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ విరాట్ విశ్వ కర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప్పల్ నియోజకవర్గ BRS పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి. అనంతరం వారు విశ్వకర్మ సోదరులు అందరూ బండారి లక్ష్మారెడ్డి కే తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. యజ్ఞం దగ్గర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ HB కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్, డివిజన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి విశ్వకర్మ సంఘం నాయకులు మల్లికార్జున చారి, లక్ష్మీ నరసింహ చారి మురళి చారి పాల్గొన్నారు.






## మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**జయభేరి, మేడిపల్లి :**

కె హెచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలు పీర్జాదిగూడ నగర పరిధిలో పంపిణీ చేయడం జరిగింది. ఈ మేరకు కె ఎచ్ ఆర్ ఫౌండర్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పీర్జాదిగూడ నగర పరిధిలోని 1వ డివిజన్ భరత్ పురి కాలనీ, 2వ డివిజన్ ఎస్వి కాలనీలలో ఒక వెయ్యి మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ జక్క వెంకట్ రెడ్డి హాజరై కె ఎచ్ ఆర్ ఫౌండర్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి తో కలిసి మట్టి గణపతి విగ్రహాలపంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కె ఎచ్ ఆర్ ఫౌండర్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి మాట్లాడుతూ... ఒక వెయ్యి మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేసినందుకు సంతోషం వెలిబుచ్చుతూ,గణపతి మండపాల దగ్గర అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.రాబోయే రోజులలో కె ఎచ్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి భగవంతుని ఆశీర్వాదాలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కే సుభాష్ నాయక్, బచ్చ రాజు, భరత్ పురి కాలనీ అసోసియేషన్, ఎస్ వి కాలనీ అసోసియేషన్, కె హెచ్ ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లు శుభ్రం చేస్తున్న సర్పంచ్ లలితనర్సింహులు, గ్రామస్తులు

## స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా శ్రమదానం

**జయభేరి, మూడుచింతలపల్లి, సెప్టెంబర్ 17 :**

మూడుచింతలపల్లి మండలంలోని అద్రాస్ పల్లి గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా గ్రామ సర్పంచ్ లలితనర్సింహులు అధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలోని రోడ్లను గ్రామస్తులతో కలిసి శుభ్రం చేసి శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జహంగీర్, వార్డుసభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## నైజాం నిరంకుశ పాలనలో రజాకార్ల అకృత్యాలు

**జయభేరి, మేడిపల్లి :**

నైజాం విముక్త స్వాతంత్ర అమృతోత్సవాల సందర్భంగ టెలీఫోన్ కాలనీలో ఏర్పాటుచేసిన జెండ ఆవిష్కరణ కార్యక్రమములో ముఖ్య అతిథిగా బోడుప్పల్ నగర పాలక సంస్థ మేయర్ సామల బుచ్చి రెడ్డి జెండా ఆవిష్కరణ చేసి నైజాం నిరంకుశ పాలనలో జరిగిన రజాకార్ల అకృత్యాలను వివరించారు. ఈ కార్యక్రమములో నైజాం విముక్త స్వాతంత్ర అమృతోత్సవాల సమితి వెంకట్ రెడ్డి నగర్ బస్తీ అధ్యక్షలు కంటతడి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురలీకృధర్, భూక్య వెంకన్న, పోలెబోయిన సత్తయ్య, టెలీఫోన్ కాలనీ అధ్యక్షులు ఎ.ప్రభాకర్ రెడ్డి, కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ నగర పాలక సంస్థ స్వచ్ఛత లీగల్ 2.0 లో భాగంగా మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా ఆపేయాలని, రోడ్లపైన చెత్త వేయరాదని ప్రజలకు సూచించారు. మన పరిసరాలు శుభ్రంగా ఉంటే ఏ రోగాలు రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# చరిత్ర చెప్పాల్సిన బాధ్యతగా 'రజాకార్' సినిమా

బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే నటీనటులుగా సమర్ వీర్ క్రియేషన్స్ బ్యానర్‌పై యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మిస్తోన్న చిత్రం 'రజాకార్'. ఆదివారం ఈ సినిమా టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. సినిమాను అన్ కాంప్రైమజ్డ్‌గా నిర్మించారు నిర్మాత గూడూరు సత్యనారాయణ. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి, దర్శకుడు యాటా సత్యనారాయణ, ఎమ్మెల్యే రాజా సింగ్, హీరోయిన్ అనుష్య త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. ''నేటి యువతకు సందేశం ఇవ్వడానికే ఈ సినిమా తీశారు. మనకు స్వాతంత్ర్యం ఎలా వచ్చింది? కాశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్‌ను ఆపేందుకు చాలా మంది ప్రయత్నించారు. కాశ్మీర్, కేరళల్లో ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. రజాకార్ సినిమా ద్వారా నాడు ఏం జరిగిందో చూపిస్తున్నారు. ఇలాంటి సినిమాను తీసే ధైర్యం చేసిన మా డైరెక్టర్‌కు థాంక్స్. ఈ సినిమాకు నేను గెస్టుగా వచ్చాను కాబట్టి ఇంకా సమస్యలు వస్తాయి. ఈ మూవీని చాలా మంది అడ్డుకుంటారు. కర్ణాటక, మహారాష్ట్ర, మన రాష్ట్రాల్లోని యువతకు మంచి సందేశం ఇచ్చేలా సినిమా ఉంటుంది'' అని అన్నారు. అనుష్య త్రిపాఠి మాట్లాడుతూ ''ఏడాదిన్నర క్రితం 'రజాకార్'కు సంబంధించిన జర్నీ ప్రారంభమైంది. ఈరోజు ఇలా మీ ముందు నిలబడి ఉన్నాం. ఇలాంటి గొప్ప సినిమాలో నటించటం గర్వంగా ఉంది. సినిమా ఇక్కడి వరకు వచ్చిందంటే మా నిర్మాత గూడూరు నారాయణరెడ్డిగారి వల్లనే సాధ్యమైంది. మనం చరిత్ర నుంచి చాలా విషయాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శకుడు యాటా సత్యనారాయణగారికి థాంక్స్'' అన్నారు. చిత్ర దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ ''ఎమ్మెల్యే రాజా సింగ్‌గారికి, నిర్మాత గూడూరు నారాయణరెడ్డిగారికి, హీరోయిన్ అనుష్య త్రిపాఠి సహా నా ఎంటైర్ టీమ్‌కు థాంక్స్. మన దేశానికి ఆగస్ట్ 15న స్వాతంత్ర్యం వచ్చింది. అయితే మన తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్ర, కర్ణాటకలకు మాత్రం స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందంటే తెలియని పరిస్థితి నెలకొంది. రక్తంతో తడిసిన చరిత్ర మట్టిలో కలిసిపోయింది. చరిత్రను తొక్కేశారు. నా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17 కథా వస్తువుగా మారింది. ఆ రోజు జరిగిన విముక్తి పోరాటం ఆధారంగా చేసుకుని ఈ సినిమాను తెరకెక్కించాను. ఇది మత పోరాటం కాదు.. స్వాతంత్ర్య పోరాటం. దీన్ని మతం దృష్టితో కాకుండా పోరాటం దృష్టితో చూడాలి. ఇది మత చరిత్ర కాదు..గత చరిత్ర. ఈ సినిమాను నేను ఇంత బాగా చేయటానికి కారణం గూడురు నారాయణ రెడ్డిగారు. మేం హీరో కోసమో మరి దేని కోసమో తాపత్రయ పడటం లేదు. స్వాతంత్ర్యం కోసం ఇక్కడ జరిగిన పోరాటమే హీరో. ఇది మన చరిత్ర, మన పెద్దల చరిత్ర. కాబట్టి అందరూ ఈ సినిమాను భుజ స్కంధాలపై తీసుకెళతారని ఆశిస్తున్నాను. సర్దార్ వల్లభాయ్ పటేల్ రూపంలో జరిగిన పోరాటమే విమోచన పోరాటం.. అదే రోజున విలీనం జరిగింది. ఆ తర్వాత అందరం సమైక్యతా భావంతో ఉన్నాం'' అన్నారు. నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి మాట్లాడుతూ ''ఇది జరిగిన కథ. ఓట్ల కోసం శవాలపై పేలాలను ఏరుకునే వ్యక్తులు ఈ చరిత్రను కప్పి పెట్టారు. ఆనాడు మన సమాజంలో జరిగిన విషయాలు గురించి ఈనాటి యువ తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది నా బాధ్యతగా భావించి రజాకార్ సినిమా చేశాను. దీన్ని ఎవరూ వక్రీకరించవద్దు. ఇక్కడి వారికి చాలా మందికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో తెలియదు. అలాంటి వారందరికీ ఈ సినిమా ఓ మంచి మెసేజ్‌ను అందిస్తుందని, మన చరిత్ర గురించి తెలియజేస్తుందని అనుకుంటున్నాను'' అన్నారు.

# పాన్ ఇండియా మూవీ 'మెగా' టీజర్ విడుదల

మిలియన్ల మంది ఫాలోవర్లను కలిగిన పాపులర్ యూట్యూబర్, ఫిలాంత్రోపిస్ట్ హర్ష సాయి పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న చిత్రంతో బిగ్ స్క్రీన్‌లోకి అడుగుపెడుతున్నారు. హర్ష సాయి స్వయంగా రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ పిక్చర్స్ బ్యానర్‌పై మిత్ర నిర్మించారు. ఈ సినిమాలో మిత్ర హీరోయిన్ గా కూడా నటిస్తున్నారు. చిత్ర యూనిట్ నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్ లో టీజర్ ద్వారా సినిమా టైటిల్‌ను అనౌన్స్ చేశారు మేకర్స్. ఈ చిత్రానికి 'మెగా' అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. లో డాన్ అనేది ట్యాగ్‌లైన్. టీజర్ సినిమా ప్రిమైజ్ ని పరిచయం చేస్తుంది. వేలాడుతున్న భారీ గంట ఎంత ప్రమాదకరమో డాక్టర్ తన డ్రైవర్‌కి వివరించడంతో టీజర్ ప్రారంభమవుతుంది. అతని చుట్టూ భారీ గుంపుతో హీరోని తాళ్లతో కట్టివేసారు.ఒక వ్యక్తిని కట్టి, తలక్రిందులుగా వేలాడదీసి, గంట మోగినప్పుడు, అతడు మెదడు గాయంతో చనిపోతాడు. కానీ హీరో ఎప్పుడూ ఓటమిని ఒప్పుకోడు. హీరోని తిమింగలంతో పోలుస్తూ.. అతడికి 100 సింహాల బలం ఉందని చెప్పినపుడు.. మెగా లో డాన్ గా పరిచయం అవుతారు. యంగ్ స్టర్ తన అరంగేట్రంలో గొప్ప ముద్ర వేశాడు. హీరోని చంపడానికి ప్రయత్నించే వ్యక్తి గ్రహాంతరవాసిలా కనిపిస్తున్నారు. ఓవరాల్‌గా, టీజర్ కాన్సెప్ట్ , ప్రెజెంటేషన్ మైండ్ బ్లోయింగ్ గా వుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత మిత్ర మాట్లాడుతూ.. కల్వకుంట్ల వంశీధర్ రావు గారు చాలా సపోర్ట్ చేశారు. ఆయన సపోర్ట్ లేకుండా ఇది జరిగేది కాదు. ఆయన ప్రోత్సాహం ఎప్పుడూ వుండాలని కోరుకుంటున్నాను. ఈ ప్రాజెక్ట్ ద్వారా చాలా నేర్చుకున్నాను. చిన్న ఆలోచనగా మొదలైన ఈ ప్రాజెక్ట్ చాలా భారీస్థాయిలోకి వెళ్ళింది. చాలా మంచి టెక్నికల్ టీం పని చేస్తోంది. ఆదిపురుష్‌కి పనిచేసిన డీఓపీ కార్తీక్ పళనితో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. ఇంతమంచి టెక్నికల్ టీంతో కలసి పని చేయడం అనందంగా వుంది. మీ రియల్ హీరో హర్ష సాయిని రీల్ హీరోగా ప్రెజెంట్ చేయడం శ్రీ పిక్చర్స్ కు దక్కిన అదృష్టం. అతను సినిమాతో మీ మనసుల్ని గెలుచుకోవాలని కోరుకుంటున్నాను'' 2024లో విడుదల కానున్న ఈ హైబడ్జెట్ ఎంటర్‌టైనర్‌కి కార్తీక్ పళని సినిమాటోగ్రఫర్ గా పని చేస్తుండగా, వికాస్ బాడిసా సంగీతం అందిస్తున్నారు.







# ఆ మిస్టరీ పర్సనెవరో నాకే తెలియదు?

'నా కూతురు పెళ్లి చేయాల్సింది నేను. నన్ను చేయనివ్వండి. మీకెందుకు తొందర?' అంటూ అసహనం వ్యక్తం చేశారు సురేశ్ కుమార్. ఇంతకి ఈ సురేశ్‌కుమార్ ఎవరనుకుంటున్నారా? మన మహానటి కీర్తి సురేశ్ నాన్నగారు. కొన్ని రోజులుగా కీర్తి సురేశ్ పెళ్లిపై సోషల్ మీడియాలో రూమర్లు చక్కర్లుకొడుతున్నాయి. సంగీత దర్శకుడు అనిరుధ్, కీర్తి ప్రేమలో ఉన్నారని, త్వరలో పెళ్లిపీటలు ఎక్కనున్నారని ఈ రూమర్ల సారాంశం. దక్షిణాదిలోనే అనుకుంటే.. ఈ వార్త బాలీవుడ్ మీడియాలో కూడా బలంగా వినపడుతున్నది. దీంతో సురేశ్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. 'అసలు ఈ వార్తల్లో నిజంలేదు. ఎవరో పనిగట్టుకొని పుకార్లు సృష్టిస్తున్నారు. ఇంతకుముందు కూడా ఇలాంటి వార్తలు కొన్ని వచ్చాయి. మేం పట్టించుకోలేదు. రానురాను మరీ ఎక్కువ చేస్తున్నారు' అంటూ మండిపడ్డారు సురేశ్ కుమార్. ఈ విషయంపై కీర్తి సురేశ్ మాట్లాడుతూ 'అనిరుధ్ నాకు మంచి స్నేహితుడు. ఇంచుమించూ మాది ఒకే ఏజ్. అందుకే క్లోజ్‌గా ఉంటాం. దానికే ప్రేమంటే ఎలా? నా జీవితంలోకి అడుగుపెట్టే ఆ మిస్టరీ పర్సన్ ఎవరో నాకే తెలీదు. తెలిస్తే తప్పకుండా చెబుతాను' అన్నారు.

# '7/జీ' పార్ట్ 2 వచ్చే నెల నుంచి.. ఏ.ఎం.రత్నం

ప్రముఖ నిర్మాత ఏయం రత్నం నిర్మాణంలో, క్రియేటివ్ డైరెక్టర్ సెల్వ రాఘవన్ వెండితెరపై ఆవిష్కరించిన ఆల్ టైమ్ కల్ట్ క్లాసిక్ '7/జీ బృందావన్ కాలనీ'. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన ఈ చిత్రం ఎవర్ గ్రీన్ బ్లాక్ బస్టర్ గా సంచలన సాధించి ప్రేక్షకుల మనసులో నిలిచిపోయింది. ఇప్పుడు ఈ సినిమా మరోసారి ప్రేక్షకులని అలరింబోతుంది. నిర్మాతలు ఉదయ్, యతి ఏయు సినిమాస్ & వివై ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా సెప్టెంబర్ 22న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్ ని లాంచ్ చేసిన మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో నిర్మాత ఏయం రత్నం మాట్లాడుతూ.. నేను చేసిన ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో '7/జీ బృందావన్ కాలనీ' కల్ట్ మూవీ. ఈ సినిమాకి చాలా మంచి పేరు వచ్చింది. తెలుగు తమిళ్ రెండూ భాషల్లో పెద్ద విజయం సాధించింది. ఇదొక పోయిటిక్ సినిమా. సినిమా ప్రారంభం ముగింపు పొయిటిక్ గా వుంటాయి. ఉదయ, యతి చాలా శ్రద్ధ తీసుకొని ఈ సినిమాని రిరిలీజ్ చేస్తున్నారు. రీరిలీజ్ లో కూడా ఈ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకం వుంది. రవితో మళ్ళీ రీఎంట్రీలా '7/జీ బృందావన్ కాలనీ' పార్ట్ 2 ని వచ్చే నెల నుంచి మొదలు పెడుతున్నాం. సెల్వరాఘవన్ దర్శకత్వం వహిస్తారు. స్క్రిప్ట్ అద్భుతంగా వచ్చింది'' అన్నారు. రవికృష్ణ మాట్లాడుతూ..ట్రైలర్ చూసిన తర్వాత మళ్ళీ రవి పాత్రలోకి వెళ్ళిపోయాను ( నవ్వుతూ) చాలా రోజులు గా రీరిలీజ్ చేయాలనీ నాన్న అనుకున్నారు. సెకండ్ పార్ట్ ని కూడా ప్లాన్ చేస్తున్నాం. పార్ట్ 2కి ముందు మరోసారి 7/జీ మ్యాజిక్ చూపించేలా చిత్రం రీరిలీజ్ జరుగుతోంది. అందరూ థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. సోనియా అగర్వాల్ మాట్లాడుతూ.. '7/జీ బృందావన్ కాలనీ' చిత్రాన్ని మరోసారి బిగ్ స్క్రీన్ పై చూసే అవకాశం రావడం నిజంగా చాలా ఆనందంగా వుంది. మీ అందరి ప్రోత్సాహానికి కృతజ్ఞతలు. అందరూ తప్పకుండా ఈ సినిమా థియేటర్స్ లో చూడండి'' అని కోరారు. ఉదయ్ మాట్లాడుతూ.. మాకు ఈ అవకాశం ఇచ్చిన రత్నం కి కృతజ్ఞతలు. రీరిలీజ్ ప్రింట్ అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. తప్పకుండా మీరంతా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో సుమన్ శెట్టితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.







# కోయంబత్తూర్‌లో రజినీకాంత్ సందడి

రీసెంట్‌గా జైలర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తున్నాడు తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్. జైలర్ సక్సెస్‌ను ఫుల్ ఎంజాయ్ చేస్తున్న రజినీకాంత్ ప్రస్తుతం తలైవా 170 పై ఫోకస్ పెట్టారు. జై భీమ్ ఫేం టీజే జ్ఞానవేల్ డైరెక్షన్‌లో ఈ సినిమా రాబోతుంది. మరోవైపు లోకేశ్ కనగరాజ్ తో తలైవా 171కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ఇవాళ కోయంబత్తూర్ ఎయిర్‌పోర్టులో సందడి చేశారు రజినీకాంత్. అభిమానులు, ఫాలోవర్లు పెద్ద సంఖ్యలో ఎయిర్‌పోర్టు వద్దకు వచ్చారు. చాలా కాలం తర్వాత అభిమానుల మధ్య ఫు హ్యాపీ మూడ్‌లో కనిపించారు తలైవా. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీని ప్రేక్షకులు చూడటానికి కొంత సమయం పడుతుంది. టీజే జ్ఞానవేల్ డైరెక్షన్‌లో చేస్తున్న సినిమా పూర్తయ్యాకే లోకేశ్ కనగరాజ్ సినిమాపై ఫోకస్ పెట్టబోతున్నానని చెప్పారు. లోకేశ్ కనగరాజ్ డైరెక్షన్‌లో సినిమా చాలా బాగా వస్తుందని, అభిమానులు కొంతకాలం వేచి చూడాలని మీడియా ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తలైవా 170 చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుబాస్కరన్ నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. తలైవా 170 చిత్రంలో విలన్‌గా మలయాళ స్టార్ హీరో ఫహద్ ఫాసిల్ ను ఫైనల్ చేశారని వార్తలు వస్తుండగా.. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇప్పటివరకు నడుస్తున్న ప్రకారం తలైవా 170 2024లో థియేటర్లలో సందడి చేయనుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com